క్లుప్తంగా

ఎన్నికలను బహిష్కరిస్తాం



వేల్పూర్: తమ గ్రామానికి పచ్చలనడ్కుడ గ్రామంతో ఏర్పడిన ఇసుక వివాదాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని, సమస్యను ఇలాగే వదిలేస్తే ఎన్నికలను బహిష్కరిస్తామని మండలంలోని జాన్కంపేట్ గ్రామస్తులు అన్నారు. ఇసుక వివాదం విషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని నిరసిస్తూ జాన్కంపేట్ గ్రామస్తులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. భీమ్‌గల్ ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, వేల్పూర్ ఎస్సై వినయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. నడ్కుడ గ్రామస్తులను పిలిపిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

గౌడ్స్ అభివృద్ధి కోరేవారికి మద్దతు

మాక్లూర్: గౌడ్‌ల అభివృద్ధి కోరుకునే వారికి మద్దతిస్తామని గౌడ సంఘం మండల అధ్యక్షుడు పుంజు దిలీప్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో సోమవారం మండల గౌడ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌడ్స్ అందరూ ఏకతాటిపై ఉండాలని కోరారు. రాజకీయాల్లో గౌడ్‌ల బలం చూపాలన్నారు. సంఘం సభ్యులు సత్యనారాయణగౌడ్, ప్రహ్లాద్‌గౌడ్, విజయ్‌గౌడ్, సత్యాగౌడ్, ప్రసాద్‌గౌడ్, చిన్నాగౌడ్, జగన్‌గౌడ్, మల్లాగౌడ్, భూమేశ్‌గౌడ్, నవీన్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ప్రచారం



వేల్పూర్/ఆర్మూర్‌టౌన్/మాక్లూర్: బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల బీఆర్‌ఎస్ అభ్యర్థులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆశన్నగారి జీవన్‌రెడ్డికి మద్దతుగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వేల్పూర్ మండలం మోతెలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి సతీమణి నీరజారెడ్డి, ఆర్మూర్ పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, మాక్లూర్ మండలం వల్లభాపూర్‌లో సర్పంచ్ మంజులాసుధాకర్ ప్రచారం చేశారు.

సిద్ధులగుట్టపై పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథసిద్ధుల గుట్టపై ఉన్న శివాలయానికి భక్తులు సోమవారం పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని దీపారాధన చేశారు. ఆలయ పూజారి కుమార్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, శివలింగానికి పంచామృతంతో అభిషేకం చేశారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. బి.సుమన్, పీసీ గంగారెడ్డి, గంగాకిషన్, నక్కల లక్ష్మన్, మల్లయ్య, చిన్నారెడ్డి, అయ్యప్పశ్రీనివాస్, మీనాచందు పాల్గొన్నారు.

బీఎల్‌వోలను సంప్రదించాలి

ఆర్మూర్‌టౌన్: నియోజకవర్గం పరిధిలోని ఓటర్లకు బూత్‌స్థాయి అధికారులు ఓటరు సమాచార స్లిప్పులను అందజేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వినోద్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు స్లిప్పులు పొందని వారు బీఎల్‌వోస్‌లను సంప్రదించాలని సూచించారు. మరింత సమాచారం కోసం బూత్ స్థాయి అధికారిని ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

మతోన్మాద రాజకీయాలకు స్వస్తి పలకాలి

నవీపేట : ఎన్నికల బరిలో పోటీలో ఉన్న ప్రధాన పార్టీలు మతోన్మాద రాజకీయాలకు స్వస్తి పలకాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎంలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. డివిజన్ నాయకులు డి రాజేశ్వర్, గుమ్ముల గంగాధర్, రవి, మల్లేశ్, సాయినాథ్, ఒడ్డెన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

బాల్కొండ/కమ్మర్‌పల్లి: బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ సమక్షంలో పలువురు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. మెండోరా మండలం దూదిగాం గ్రామానికి చెందిన 40 మంది మాల సంఘం మహిళలు, కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సతీష్, నవీన్, ముఖేష్, రాజేందర్, నవీన్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వారందరికీ సునీల్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కిసాన్‌నగర్ వీడీసీ అధ్యక్షుడు పురుషోత్తం డీసీసీ డెలిగేట్ కపిల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

అభివృద్ధికి నిలువుటద్దం ఆర్మూర్

- సీఎం కేసీఆర్ కృషితో వందపడకల ఆసుపత్రి
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో చర్చ జరగాలి
- బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్ రెడ్డి



పెర్కిట్‌లో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి



ప్రచార కార్యక్రమానికి హాజరైన ప్రజలు

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణం అభివృద్ధికి నిలువుటద్దమని ఎమ్మెల్యే, ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆర్మూర్ పట్టణంలోని 4,21,5,6,7 వార్డుల్లో 'ప్రజా ఆశీర్వాదయాత్ర' నిర్వహించిన జీవన్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి ఆయా వార్డుల ప్రగతి నివేదికలను ప్రజల ముందుంచి ఇన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇచ్చింది కేసీఆర్, తెచ్చింది తానని అన్నారు. ఆర్మూర్ పట్టణం గత పాలకుల హయాంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేదని, ఈ తొమ్మిదన్నరేళ్లలో అభివృద్ధి పథంలో పరుగులు పెడుతూ.. ప్రగతికి చిరునామాగా మారిందన్నారు. బైపాస్ రోడ్డు ఆర్మూర్ ప్రగతికి సోపానాలుగా మారాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని సామాజిక వర్గాలకు ఫంక్షన్ హాళ్లు నిర్మించామన్నారు. సీఎం కేసీఆర్ కృషితో ఆర్మూర్‌కు వందపడకల ఆస్పత్రి వచ్చి ప్రజలందరికీ వైద్యం చేరువైందని పేర్కొన్నారు. పెర్కిట్ చెరువు, రెడ్డిచెరువుల్లో కాలుష్యనివారణ పనులు, మోడ్రన్ ధోబీఘాట్, గూండ్లచెరువును టూరిజం అభివృద్ధి పనులు, వెజ్–నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం, సిద్దులగుట్ట ఘాట్ రోడ్డు, ఆలూరు, ఆర్టీసీ బైపాస్ రోడ్లు, అంబేద్కర్ చౌరస్తా అందాలు, డివైడర్లు, అన్ని కుల సంఘాల భవనాల నిర్మాణానికి నిధులు, పట్టణంలో రోడ్ల నిర్మాణ పనుల గురించి ప్రస్తావించారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాలన్నారు. కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు గడప గడపకూ వెళ్లి అభివృద్ధిపై ప్రచారం చేయాలని సూచించారు. బీజేపీ వస్తే ప్రజల మధ్య మతం చిచ్చు, అబద్ధాల రొచ్చుతో సమాజాన్ని సర్వనాశనం చేస్తారన్నారు. ఆర్మూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా అభివృద్ధి చేశామన్నారు. నియోజకవర్గంలోని డొంకేశ్వర్, ఆలూర్ కేంద్రాలుగా కొత్త మండలాలుగా ఏర్పాటు చేశామన్నారు. రూ. 120కోట్లతో ఫత్తేపూర్–చేపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును సాధించామన్నారు.

భావితరాల కోసం బీఆర్‌ఎస్‌కు ఓటెయ్యండి

డొంకేశ్వర్/నందిపేట్(ఆర్మూర్): భావితరాల కోసం ఆలోచించి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని జీవన్‌రెడ్డి కోరారు. డొంకేశ్వర్ మండలం గంగాసముందర్, నందిపేట మండలం జోర్పూర్, సీహెచ్ కొండూర్ గ్రామాల్లో జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే అరాచకాన్ని కొని తెచ్చుకున్నట్లేనని అన్నారు. వారిని గెలిపిస్తే సంక్షేమ పథకాలు తగ్గిపోతాయన్నారు. వ్యవసాయానికి ఉచిత కరెంట్ ఇవ్వరని, రైతులు నష్టపోతారన్నారు. గంగాసముందర్ సర్పంచ్ మగ్గిడి లక్ష్మీప్రవీణ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గత పాలకులు నీళ్లివ్వలేకపోయారు



ఎన్నికల ప్రచారంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

- మేము కాళేశ్వరం జలాలను తీసుకొచ్చాం
- ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అందుతుంది
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో మంత్రి ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్: డెబ్బై ఏళ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ పాలకులు మంచి నీళ్లు ఇవ్వలేకపోయారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కప్పల వాగులోకి కాళేశ్వరం జలాలను తీసుకొచ్చి పంటపొలాలను పారించామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అవుతుందని ఆయన స్పష్టం చేశారు. మండలంలోని సికింద్రాపూర్, సికింద్రాపూర్‌తండా, గోన్‌గొప్పుల, గోన్‌గొప్పుల తండాలో ప్రశాంత్‌రెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భీమ్‌గల్ ప్రాంతాన్ని గత పాలకులు సాగునీటిపరంగా అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఈ ప్రాంతానికి శాశ్వతంగా ఉపయోగపడేలా ప్యాకేజీ–21 పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఎస్‌ఆర్‌ఎస్‌పీ బ్యాక్‌వాటర్ ను బినోల నుంచి సారంగ కాలువ ద్వారా మెంట్రాజ్‌పల్లి పంప్ హౌజ్‌కు తరలించి అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా మన ప్రాంతంలోని కప్పలవాగులోకి కాళేశ్వరం జలాలు తీసుకొచ్చామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక కరెంట్ సమస్యలు తొలగిపోయాయని అన్నారు.

తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరిక

భీమ్‌గల్ పట్టణానికి చెందిన మజీద్ ఇమామ్ మౌలాన జమీల్ కాంగ్రెస్ నుంచి తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీ రైతుల కోరిక తీర్చింది

- బాల్కొండ బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ



ఎన్నికల ప్రచారంలో ఏలేటి అన్నపూర్ణమ్మ

వేల్పూర్: బీజేపీ ప్రభుత్వం పసుపుబోర్డు ఏర్పాటు చేసి నిజామాబాద్ జిల్లా పసుపు రైతులు చిరకాల కోరికను తీర్చిందని బాల్కొండ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. వేల్పూర్ మండలం అంక్సాపూర్‌లో అన్నపూర్ణమ్మ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పసుపుబోర్డు ఏర్పాటుతో రైతుల కష్టాలు తొలగిపోయి, రానున్న రోజుల్లో ఎంతో మేలు జరుగుతుందన్నారు. పడగల్ నవాబు ఎత్తిపోతల పథకం టీడీపీ హయాంలో ఎంతో నాణ్యతగా నిర్మించారని ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పనులన్నీ నాణ్యతాలోపంతో ఉన్నాయని విమర్శించారు. యువతను విస్మరించి ఉద్యోగాలు ఇవ్వని ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. బీజేపీ నాయకులు మల్కన్నగారి మోహన్, ఏలేటి రమేశ్‌రెడ్డి, నామాల అశోక్, ఏనుగు శ్రీధర్, చిన్నారెడ్డి, చెడిమెల మోహన్, కుమ్మరి కిషన్, ఆర్మూర్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీల మధ్యే పోటీ

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లో బీఆర్‌ఎస్, బీజేపీ మధ్యే గట్టిపోటీ ఉన్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడ పాటి ప్రకాశ్‌రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందన్నారు. బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన మొట్టమొదటి పార్టీ బీజేపీ అని అన్నారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి మూడు పర్యాయాలు గెలిచినా అసెంబ్లీలో ఒక్కసారైనా నియోజకవర్గంలోని సమస్యలపై చర్చించిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. బోధన్‌లోని రామాకాంత్ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న యువశక్తి సంకల్ప సభకు యువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ముఖ్య అతిథిగా ఎంపీ ధర్మపురి అర్వింద్ హాజరవుతారని తెలిపారు. పార్టీ ఆయా విభాగాల నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు

- ధనార్జనే ధ్యేయంగా షకీల్ పాలన
- కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి



సుదర్శన్‌రెడ్డికి గజమాలతో స్వాగతం



సాలంపాడ్‌లో మాట్లాడుతున్న పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి

బోధన్/బోధన్ టౌన్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజా విశ్వాసాన్ని కోల్పోయాయని, ఎన్నికల హామీలను ఆ రెండు పార్టీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశాయని ఆరోపించారు. సోమవారం బోధన్ మండలంలోని పెంటాకుర్దు క్యాంప్, సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్, సాలంపాడ్, కుమ్మన్‌పల్లి, కొప్పర్తి క్యాంప్, జాడిజమాల్‌పూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించడంతో పాటు బోధన్ పట్టణంలో నిర్వహించిన స్ట్రీట్‌కార్నర్ మీటింగుల్లో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలోఅభివృద్ధి శూన్యమని, బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మడం లేదని, ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పనున్నారని పేర్కొన్నారు. బోధన్ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు గెలిచిన ఎమ్మెల్యే షకీల్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, ధనార్జనే ధ్యేయంగా పాలన సాగించారని విమర్శించారు. నియోజకవర్గానికి ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు పంపిణీ చేయలేదన్నారు. నియోజక వర్గఅభివృద్ధిని విస్మరించారని, పట్టణంలోని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు పెరిగి పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఇబ్బందుల పాలయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ స్కీంలు, ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను సుదర్శన్‌రెడ్డి వివరించారు. రూ.500లకే గ్యాస్‌సిలిండర్, మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు నెలకు రూ. 2,500, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు, ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు రూ.6 లక్షలు ఇస్తామని వివరించారు. రైతు భరోసా స్కీం ద్వారా ఎకరానికి రూ. 15 వేల పెట్టుబడి సాయంతోపాటు కౌలురైతులకు సాయం అందిస్తామన్నారు. రూ. 2 లక్షల వరకు పంట రుణం మాఫీ చేస్తామన్నారు. పెంటాకుర్దు క్యాంప్‌లో సుదర్శన్ రెడ్డిని గజమాలతో సన్మానించి ఘనస్వాగతం పలికారు. పార్టీ నాయకులు తూము శరత్ రెడ్డి, గంగాశంకర్, నాగేశ్వర్‌రావు,అల్లె రమేశ్, మందర్న రవి, హన్మంత్‌రావు, వెంకటేశ్వర్ రెడ్డి, తూము రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, దొడ్ల రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు పాషా మోయినొద్దీన్, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు తలారి నవీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ

- ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం
- బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్



మాట్లాడుతున్న ముత్యాల సునీల్



కాంగ్రెస్‌లో చేరినవారితో ముత్యాల సునీల్

భీమ్‌గల్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడంతో పాటు రైతుభరోసా కింద ఎకరానికి రూ.15వేల పెట్టుబడి సాయం, భూమిలేని రైతుకూలీలకు ఏడాదికి రూ.12వేల సాయం అందిస్తామని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ అన్నారు. మండలంలోని బాబాపూర్, గోన్‌గొప్పుల, సికింద్రాపూర్ గ్రామాల్లో సునీల్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగా ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి నియోజకవర్గంలో అవినీతి, అరాచక పాలన కొనసాగించి వందల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారని, చీరలు, హెల్మెట్లు పంపిణీ చేసి ప్రజలను, యువతను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఒకే కాంట్రాక్టర్‌కు పనులు అప్పజెప్పి వందల కోట్ల రూపాయలను దుర్వినియోగం చేశాడని, ప్రజలను మోసం చేసిన ప్రశాంత్‌రెడ్డికి కర్రుకాల్చి వాత పెట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.2500లు జమ చేస్తామని, ఇప్పుడు ఉన్న పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ప్రతి కుటుంబానికి రెండు వందల యూనిట్లలోపు ఉచిత విద్యుత్, విద్యార్థులకు యువ వికాసం పథకం ద్వారా రూ.5 లక్షల విద్యా భరోసా కార్డులు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఒక్కసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చి తనను ఎమ్మెల్యే గా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, రాడె మురళి, చిన్నారెడ్డి, రాడె తేజ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

భీమ్‌గల్ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్, టీడీపీ నాయకులు, కుప్కల్‌కు చెందిన యువసేవ యూత్ సభ్యులు, బడా భీమ్‌గల్, బెజ్జోరా గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ముత్యాల సునీల్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పేదలందరికీ ఇళ్లు

- ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి రాకేశ్ రెడ్డి



పార్టీలో చేరినవారితో పైడి రాకేశ్‌రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మంథని గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జైడి శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులతో కలిసి సోమవారం బీజేపీలో చేరారు. మామిడిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి రాగానే.. మేనిఫెస్టో ప్రకారం పేదలందరికీ ఇళ్లు, వరికి రూ.3,100 మద్దతు ధర, ఉజ్వలయోజన పథకంలో సంవత్సరానికి నాలుగు ఉచిత సిలిండర్లు, పుట్టిన ఆడబిడ్డకు రూ.2 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, దినేశ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – టైగర్ 3 (తెలుగు)- 10.05
స్పార్క్ లైఫ్ (తెలుగు)-1.30, 10.30
మా ఊరి పొలిమేర-2(తెలుగు) - 5.00
కీడా కోలా(తెలుగు) - 7.50

స్క్రీన్-2 – మంగళవారం (తెలుగు)- 10.00, 1.10, 4.20, 7.30, 10.40

స్క్రీన్-3 – అన్వేషి (తెలుగు)- 10.00
సప్త సాగరాలు(తెలుగు)- 12.50, 4.00, 7.10
టైగర్-3 (తెలుగు)- 10.20

స్క్రీన్-4 – టైగర్-3 (తెలుగు)- 11.15, 2.40, 6.05, 9.30

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి మోహన్‌రెడ్డి

రెంజల్(బోధన్): నియోజకవర్గ ప్రజలు తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బోధన్ బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దూపల్లి, దండిగుట్ట, కళ్యాపూర్, కూనేపల్లి, బాగేపల్లి, వీరన్నగుట్ట, రెంజల్ గ్రామాల్లో మోహన్‌రెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీతికి, అవినీతికి జరుగుతున్న ఎన్నికలని, చివరకు నీతి మాత్రమే విజయం సాధిస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్‌కు మూడు పర్యాయాలు, బీఆర్‌ఎస్‌కు రెండు పర్యాయాలు అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. తనకు ఈసారి అవకాశం ఇవ్వాలని కోరారు.

పార్టీలో చేరిక

మండలంలోని దూపల్లి, వీరన్నగుట్ట, రెంజల్ గ్రామాలకు చెందిన పలువురు యువకులు బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి మోహన్‌రెడ్డి ఆహ్వానించారు.

గల్ఫ్ కార్మికులు ప్రశాంత్‌రెడ్డికి అండగా నిలవాలి

- గల్ఫ్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి



కమ్మర్‌పల్లి: గల్ఫ్ కార్మికులు అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని గల్ఫ్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నరసింహానాయుడు కోరారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంతోపాటు నాగాపూర్, హాసాకొత్తూర్, బషీరాబాద్, చౌట్‌పల్లి గ్రామాల్లో నరసింహానాయుడు సోమ వారం గల్ఫ్‌కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గల్ఫ్‌లో పని చేస్తున్న తెలంగాణ కార్మికులు దురదృష్టవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రైతుబీమా తరహాలో రూ.5 లక్షలు బీమా సదుపాయం కల్పిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా గల్ఫ్ నుంచి తిరిగి వచ్చిన కార్మికులకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ స్వామి, నాయకులు రాజేశ్వర్, గణేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.